# చెదలు - నివారణ

చెదలు ముఖ్యంగా కొయ్య సామాగ్రినే గాక, వివిధ పంటలను, పలు చెట్లను ఆశించి చెట్టు లోపలి మెత్తటి భాగాన్ని తినేస్తాయి. ఈ పురుగు యొక్క బెడద చెల్కా మరియు ఎర్రమట్టి నేలల్లో ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు సామూహికంగా పుట్టల్లో నివశిస్తాయి. ఇవి ముఖ్యంగా 4 తెగలు. 1) రాణి 2) రాజు 3) పనిచేసే చెదపురుగులు (సేవకులు) 4) సైనిక చెద పురుగులు. రాణి మరియు రాజు పురుగులు మొదట రెక్కలు కలిగి వుంటాయి. ఈ రెక్కల పురుగులు తొలకరి వర్షాలు పడిన వెంటనే పుట్టనుండి బయటకు వచ్చి నేలమీదకానీ, గాలిలోగాని సంపర్కం జరుపుకొంటాయి. సంపర్కం జరిగిన తరువాత పురుగుల రెక్కలు రాలిపోతాయి. రెక్కలు రాలిన రాణి పురుగు భూమిలోనికి పోతుంది. ఆ తర్వాత రాణి పురుగు పరిమాణం చాలా పెద్దదిగా మారి గ్రుడ్లు పెట్టడం మొదలు పెడుతుంది. బాగా అభివృద్ధి చెందిన రాణి పురుగు ఒక రోజులో షుమారుగా 30,000-80,000 గ్రుడ్లు పెడుతుంది. ఈ విధంగా అవసరాన్ని బట్టి 7-10 సం॥ల వరకు గ్రుడ్లు పెడుతుంది. గ్రుడ్ల నుండి పిల్ల పురుగులు 1 నెల నుండి 3 నెలల లోపు బయటకొస్తాయి. పిల్ల పురుగులు పెద్ద పురుగులుగా మారటానికి సంవత్సరకాలం పడుతుంది. పనిచేసే చెదపురుగులు తెల్లగా లేక గోధుమ వర్ణం కలిగి చాలా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. సైనిక పురుగులు, పనిచేసే పురుగులకంటే పెద్దవిగా ఉండి రెక్కలు లేకుండా ఉంటాయి.

**నష్టపరిచే విధానం :** పనిచేసే పురుగులు ఎక్కువ సంఖ్యలో పంట పొలాలను ఆశించి మొక్కల కాండంలోనికి పోయి లోపలి పదార్థాన్ని తింటాయి. అలా తినటం వలన ఏర్పడిన ఖాళీ ప్రదేశాలను మట్టితో నింపుతాయి. దీనివలన మొక్కలు మొదట వడలిపోయి తరువాత ఎండిపోయి, చనిపోతాయి. మొక్కలను పీకితే సునాయాసంగా ఊడొస్తాయి. పండ్ల మరియు అడవి జాతుల మొక్కల బెరడును తింటూ మట్టితో కప్పేస్తాయి. ఆశించిన చెట్లు గిడసబారిపోతాయి. ఈ పురుగులు ఆశించిన నారుమళ్లు వడలి చనిపోతాయి. వీటి ఉధృతి మెట్ట పంటల్లో మరియు నీటి ఎద్దడి ఉన్న పండ్లతోటల్లో ఎక్కువగా ఉంటుంది.

**నివారణ :** పంటపొలాల గట్లపైన లేక పొలం చుట్టూ ఉన్న చెదపుట్టలను పూర్తిగా త్రవ్వి రాణి పురుగును వెలికి తీసి చంపాలి. 5 మి.లీ. క్లోరిపైరిఫాస్ 50 ఇ.సి. మందును లీటరు నీటికి కలిపి సుమారు 15-30 లీటర్ల మందు ద్రావణాన్ని చెదపుట్టల్లో బాగా తడిచేటట్లు పోయాలి.

వేరుశనగలో వీటి నివారణకు కిలో వేరుశనగ విత్తనాన్ని 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందుతో విత్తన శుద్ధి చేసి, నీడలో ఆరబెట్టి మరుసటిరోజు విత్తాలి.

చెరకులో వీటి నివారణకు చెరకు గడలను మలాథియాన్ (లీటరు నీటికి 2.0 మి.లీ. మోతాదులో కలిపిన) ద్రావణంలో 15 నిమిషాలుంచిన తరువాత నాటాలి.

పండ్లతోటల నారుమడులను తయారు చేసేటప్పుడు లిండేను, మిథైల్ పెరాథియాన్ లేదా మరేదైనా పొడిమందు నారుమడుల్లో కలపాలి. చెట్లు నాటే గుంతల్లో కూడా ఏదైనా పొడిమందును గుంతకు 100 గ్రా. మోతాదులో కలపాలి. పాలిథిన్ సంచులలో మొక్కలను పెంచునప్పుడు ఆ సంచులలో పోయు మట్టి మిశ్రమానికి కూడా పైన చెప్పబడిన మందులను ఒక ఘనపుటడుగుమట్టి మిశ్రమానికి ఒక కిలో మందు కలిపి సంచులలో నింపి విత్తాలి. పూల వృక్షాల మొదళ్ళకు చెదలు ఆశించునపుడు చెద మట్టి దోరలను 15 రోజులకు ఒకసారి గోనె పట్టుతో రాల్చవలయును తర్వాత క్లోరిపైరిఫాస్ 50 శాతం 5 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి చెట్టు చుట్టూ మట్టిని కదిలించి పోయవలయును.

చెదలు వాటి నివారణపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా : **"ప్రొఫెసర్&హెడ్(ఎంటమాలజి), వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500 030"**

ఫోన్ నెం. 040-24015011, ఎక్స్‌టెన్షన్ - 377